

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 181 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 01, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# చట్టాలను ఉల్లంఘిస్తున్న ఎస్ఐఆర్ !





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



దేశంలో కోట్ల ఓట్లు తొలగింపు రాజ్యాంగంలో భాగమేనా!?

“సర్” చట్టబద్ధతే నంటు తీర్పునిచ్చిన అత్యున్నత ధర్మాసనం

ఎన్నికలు పారదర్శకంగా జరుగుతున్నాయా !

“సర్” చట్టబద్ధతైతే జాతీయ ఎన్నికల కమిషనర్ చేసేది ఏమిటి

రాష్ట్రాలను ఈవీఎం ఎన్నికలతో లాక్కోవడం చట్టబద్ధతేనా

ప్రతి ఎన్నికల్లో ఒక్కొక్క రాష్ట్రంలో లక్షలాది ఓట్లు తొలగిస్తున్నారు

ప్రతిపక్షాల ఓట్లు తొలగిస్తూ ఎన్నికల నిర్వహించడం చట్టబద్ధతేనా

ఎన్నికల కమిషనర్ నియామకం రాజ్యాంగ విరుద్ధం కాదా

దారి తప్పుతున్న జాతీయ ఎన్నికల కమిషన్ పై బాధ్యత ఎవరిది

న్యాయ స్థానాలను నమ్మించి దేశ ప్రజలను మోసగిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎన్నికల్లో జరుగుతున్న విపరీతమైన దాడులకు బాధ్యులు ఎవరు

దేశ ప్రజల ఓటు హక్కులను కాలరాస్తున్నారు

చనిపోయిన వ్యక్తులను బ్రతికినట్లుగా బ్రతికిన వ్యక్తులను చనిపోయినట్లుగా చూపిస్తున్నారు

ఎస్ఐఆర్ తొలగించిన కోట్లాది ఓట్లు ఎన్నికల కమిషన్ వెబ్సైట్లో పెట్టండి : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశంలో జరుగుతున్న ఎన్నికల పట్ల పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకే అవగాహన లేకుండా పోతుందని డాక్టర్ బరిగెల శివ తెలిపారు.ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో లక్షలాది ఓట్లను దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను తొలగిస్తూ ఎన్నికలు నిర్వహించడం ప్రపంచంలో ఎక్కడ చూసి ఉండలేమన్నారు. జాతీయ ఎన్నికల విధానంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునే హక్కు జాతీయ ఎన్నికల కమిషన్ కు కలవని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం బిజెపి ప్రభుత్వానికి పూర్తిగా అనుకూలమని దేశ ప్రజల భావోద్వేగాలను వ్యక్తపరిచారు. జాతీయ ఎన్నికల కమిషన్ కొనసాగిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను దేశవ్యాప్తంగా ఉపయోగించడానికి జాతీయ ఎన్నికల కమిషన్కు హక్కులు కల్పిస్తూ సహకారంగా నిలవడంలోబిజెపి ప్రభుత్వంలోని కుట్రలో భాగంగా సర్వోన్నత న్యాయస్థానం దేశ ప్రజలపై మరింత భారాన్ని పెట్టిందని భావించాలన్నారు. ఆర్టికల్ 324 ప్రకారం సీఈసీకి పూర్తి అధికారాలు ఉంటే ఎన్నికలు ఎందుకు సజావుగా నిర్వహించబడటం లేదంటూ సూటిగా ప్రశ్నించారు.జాతీయ చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియామకంలో సీజేఐ చీఫ్ సభ్యులుగా ఉండాల్సి ఉండగా 2023 ఎన్నికల ముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తిని సీఈసీ సభ్యులుగా - మిగతా 2లో..



## మోటార్లకు మీటర్లు... బీఆర్ఎస్‌కు సవాల్ విసిరిన రేవంత్ రెడ్డి

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయబోమని సవాల్

మీటర్లు పెట్టకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న

హరీశ్ రావు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని రేవంత్ విమర్శ

రైతులకు నాణ్యమైన విద్యుత్ కోసమే ‘రైతు డిస్కం’ అని స్పష్టత

వద్దు కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు నిరసనలని హెచ్చరిక

2



## గండిపేట భూ కుంభకోణం..

బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్

గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర

ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు

నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి

ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు

మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన



6

## సాత్విక్-చిరాగ్ జోడీకి వరల్డ్ టైటిల్

7

అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

సింగపూర్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న సాత్విక్-చిరాగ్

ఫైనల్‌లో ఇండోనేషియా జోడీపై విజయం

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు

అధికారికంగా ప్రకటించాలి: కవిత డిమాండ్

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత

రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ

ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక

5






## రూ.1 కోటి క్లెయిమ్ సెటిల్మెంట్‌తో కుటుంబానికి ఆర్థిక భరోసా

టర్మ్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యాన్ని చాటిన సత్యనారాయణ పాలసీ

మార్చి 2026లో మరణించిన పాలసీదారుడి ?

కుటుంబానికి పూర్తి క్లెయిమ్ చెల్లింపు

తక్కువ ప్రీమియంతో భారీ రిస్క్ కవర్ అందించిన టాటా ఏఐఏ

పిల్లల విద్య, కుటుంబ భవిష్యత్తుకు అండగా నిలిచిన ఇన్సూరెన్స్ రక్షణ

ఇన్సూరెన్స్ ఖర్చు కాదు.. కుటుంబ భద్రతకు భరోసా అని నిపుణుల సూచనం

డాక్టర్ బరిగెల శివ జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్

3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి

**సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్**
**420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేశాకే ఎన్నికల్లో పోటీ చేయాలని సీఎంకు కేటీఆర్ సవాల్**
**ఫార్మర్స్ డిస్కం పేరుతో 24 గంటల ఉచిత విద్యుత్‌ను రద్దు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర**
**రైతులకు మూడు గంటల కరెంట్ చాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గుర్తు చేసిన కేటీఆర్**
**ఇందిరమ్మ ఇళ్లు సహా ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శ**
**ఫార్మర్స్ డిస్కం రైతుల మెడకు ఉరితాడుగా మారుతుందని వ్యాఖ్య**




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేశాకే భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే ఎన్నికల్లో పోటీ చేయనని సీఎం చెప్పడం ప్రజలను మరోసారి మోసం చేయడానికేనని ఆయన ఆరోపించారు. ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఫార్మర్స్ డిస్కం ఏర్పాటు ప్రతిపాదన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. రైతులకు కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత విద్యుత్‌ను రద్దు చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు మూడు గంటల కరెంట్ చాలని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "ఫార్మర్స్ డిస్కం అనేది రైతుల మెడకు ఉరితాడు. ఉచిత విద్యుత్‌ను పూర్తిగా ఎత్తివేయడమే దీని అంతిమ లక్ష్యం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సహా ఏ ఒక్క హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను రైతులు, పట్టణ ప్రజలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో పరిశ్రమలు పవర్ హాలిడేలు ప్రకటించేవని, రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చి, దేశంలోనే తొలిసారిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మోటార్లకు మీటర్లు... బీఆర్ఎస్‌కు సవాల్ విసిరిన రేవంత్ రెడ్డి

**వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయబోమని సవాల్**
**మీటర్లు పెట్టకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న**
**హరీశ్ రావు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని రేవంత్ విమర్శ**
**రైతులకు నాణ్యమైన విద్యుత్ కోసమే 'రైతు డిస్కం' అని స్పష్టత**
**వడ్లు కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు నిరసనలని హెచ్చరిక**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకే 'రైతు డిస్కం' ఏర్పాటు చేస్తున్నారంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ, బీఆర్ఎస్‌కు సంచలన సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగించినా, ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేసినా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయబోదని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, తాము మీటర్లు పెట్టకుండా ఉచిత విద్యుత్‌ను విజయవంతంగా కొనసాగిస్తే, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటుందా? అని నిలదీశారు. 'రైతు డిస్కం' ఏర్పాటు వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని రేవంత్ రెడ్డి వివరించారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన, అంతరాయం లేని ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, జవాబుదారీతనం పెంచడమే దీని లక్ష్యమని తెలిపారు. దేశంలోనే ఇలాంటి ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని, ఎలాంటి ప్రతిపాదన లేకుండానే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తన దగ్గర పూర్తి సమాచారం ఉందని, వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ చేస్తాయని జోస్యం చెప్పారు. ధాన్యం కొనుగోలు అంశాన్ని కూడా ప్రస్తావించిన సీఎం, మద్దతు ధర ప్రకటించిన కేంద్రమే వడ్లు కొనాలని, లేదంటే జూన్ 15 తర్వాత బీజేపీ నేతల ఇళ్ల ముందు వడ్ల కుప్పలు పోస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విద్యుత్, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐకి ఫిర్యాదు చేశామని, దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. తాను 2034 వరకు తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని, 2029లో కూడా కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# చట్టాలను ఉల్లంగిస్తున్న ఎస్ఐఆర్

మొదటి పేజీ తరువాయి





తొలగిస్తూ జాతీయ ఎన్నికల కమిషన్ కమిషనర్ను బిజెపికి అనుకూలమైన వ్యక్తిని నియమించుకోవడం కోసం ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రిని సభ్యునిగా పెట్టుకొని 2:1నిష్పత్తిలో ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తూ భారత రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా జాతీయ ఎన్నికల కమిషన్ నియామకాన్ని సమర్థించడం ప్రశ్నార్ధకంగా ఉందన్నారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి తప్పకుండా ఉండాల్సిందేనంటూ బిజెపి మొండి వైఖరి నశించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియ జాతీయ ఎన్నికల కమిషన్ చట్టబద్ధతే అన్నట్లుగా జాతీయ ఎన్నికల కమిషనర్ నియామకంలో సిజెఐ సభ్యత్వం తప్పకుండా ఉండేవిధంగా తక్షణమే రాజ్యాంగ విలువలకు అనుగుణంగా చట్టాన్ని రూపొందించాలని కోరారు.సర్ ప్రక్రియ జాతీయ ఎన్నికల కమిషన్ చట్టబద్ధతకు అనుకూలంగా ఉందని భావిస్తున్నప్పుడు అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఎన్నడు లేని విధంగా జాతీయ ఎన్నికల కమిషన్ లక్షలాది ప్రజల ఓట్లను ఎందుకు తొలగిస్తుంది అంటూ అడిగారు.సర్ ప్రక్రియ విచారణలో భాగంగా కొత్త ఓట్ల నమోదుకు పాత ఓట్ల తొలగింపు జిల్లా అధికారులైన కలెక్టర్ల అనుమతులు లేకుండా ఓట్ల తొలగింపు ప్రక్రియను ఎందుకు కొనిసాగిస్తున్నారు అంటూ నిలదీశారు.బిజెపి ప్రభుత్వం వాళ్లకి అనుగుణమైన ఏ పద్ధతినైనా మొదట జాతీయ ఎన్నికల కమిషన్ తో ప్రారంభిస్తూ ఉన్నత న్యాయస్థానాలను అత్యున్నత న్యాయస్థానాల ద్వారా ఆమోదం పొందుకోవడం దేశ ప్రజల్ని ప్రణాళిక బద్ధంగా మోసగించడమే అన్నారు.సర్ ప్రక్రియ విధానంపై తప్పుపడుతూ సుప్రీంకోర్టులో నమోదు చేయబడిన కేసులు అన్నిటిని కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకంలో బిజెపి సభ్యులైన ఇద్దరిలో ఒకరిని తొలగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పేరును చేర్చే విధంగా తక్షణమే చర్యలు చేపట్టి దేశ ప్రయోజనాలను దేశ ఎన్నికల విధానాన్ని రక్షించాలని పేర్కొన్నారు.దేశంలో ఎన్నడు లేని విధంగా సర్ ప్రక్రియ విధానం రహస్యంగా కొనసాగుతుందని దేశ ప్రజలందరూ తీవ్రమైన విమర్శలు గుప్పిస్తుంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వాళ్లకు అనుకూలమైన ఓటర్ల జాబితాలను ముందస్తుగానే సిద్ధపరచుకొని ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందే విధంగా చేస్తూ వాటిని ఎన్నికల కమిషన్ ద్వారా బలపరచుకోవడం రాజకీయ గెలుపులో సునాయసమైన మార్గంగా జరిగిపోతుందన్నారు.ఎన్నికలు వారం రోజుల్లో ఉంటుండగా లక్షలాది ఓట్లు తొలగించబడడం అనేది భారత రాజ్యాంగంలో ఏ చట్టం కల్పించిన హక్కో ప్రభుత్వం గానీ అత్యున్నత న్యాయస్థానం గాని స్పష్టంగా వెల్లడించలేకపోయారని గుర్తు చేశారు.జాతీయ ఎన్నికల కమిషన్ కొనసాగిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా చట్టబద్ధతైతే దేశ ప్రజల ఓట్లు తొలగిస్తూ విదేశీయుల ఓట్లను జతపరుస్తూ లక్షల కొద్ది ఓట్లను తొలగించడం ఏ రాజ్యాంగంలోని ఆర్టికల్ కల్పించిన చట్టమో బిజెపి ప్రభుత్వం జాతీయ ఎన్నికల కమిషన్ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని నిలదీశారు.ప్రజల మనోభావాలను పూర్తిగా దెబ్బతీస్తూ ప్రజల ఓట్లను పూర్తిగా నిర్మూలిస్తూ ఎన్నికలు నిర్వహించడం అనేది జాతీయ ఎన్నికల కమిషన్ చెల్లుబాటుగా భావిస్తుందని దానిని దేశ ప్రజలు తిప్పికొట్టే రోజు తప్పకుండా వస్తుందని హెచ్చరించారు.సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించడం జాతీయ ఎన్నికల కమిషన్ ఆనంద పడుతుందని అదేవిధంగా జాతీయ ఎన్నికల కమిషన్ ఆగడాలను సుప్రీంకోర్టు ఎందుకు పసిగట్టడం లేదంటూ గుర్తు చేశారు.మెజారిటీ జనాభా జాతీయ ఎన్నికల కమిషన్ పై లక్షల కొద్ది అభ్యర్థనలను అభియోగాలను అనుమానాలను వ్యక్తం చేస్తుండగా సుప్రీంకోర్టు మాత్రం వాటిని సునాయాసంగా తప్పు పట్టడం,తోసి పుచ్చడం బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడమేనంటూ తెలిపారు

### "సర్" ప్రక్రియ సజావుగా సాగుతుందా..

దేశంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకంలో సిజెఐ సభ్యత్వం తొలగించగా దేశంలో ఒక్కరు ప్రశ్నించింది లేదని అలాంటి సందర్భంలోనే ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగిస్తున్న సందర్భంలో కూడా దేశంలో ఎక్కడలేని అవాంతరాలు,అంతరాయాలు అనుమానాలు, ఆందోళనలు,ఏర్పడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాళ్లకి అనుగుణమైన విధానాన్ని ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా బలపరచుకోవడం కోసం న్యాయస్థానాలను ప్రభావితం చేస్తుందని దేశ ప్రజలు భావిస్తుండడం సుప్రీంకోర్టు గమనించకపోవడం బాధాకరం అన్నారు.దేశంలో సర్ ప్రక్రియ చేస్తున్న అక్రమమైన పనులను సుప్రీం ధర్మాసనం ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదంటూ సూటిగా అడిగారు.భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సర్ ప్రక్రియ తీసేయడం ఎంతవరకు సబబో బిజెపి ప్రభుత్వం బహిరంగ ప్రకటన ద్వారా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సూటిగా అడిగారు.ఎస్ఐఆర్ ప్రక్రియ అనేది రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలాగా పనిచేస్తుంది అనేది ఆయా ప్రభుత్వాలతో పాటు దేశ ప్రజలు బలంగా విమర్శిస్తున్న సందర్భాల్లో ప్రజలతో సంబంధం లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ విధంగా విచారణ కొనసాగిస్తుందో దేశ ప్రజలకు చెప్పండి అంటూ సూటిగా ప్రశ్నించారు.ప్రజా విలువలకు ప్రజాహక్కులకు ప్రజా ఓట్లకు ఏమాత్రం అనుకూలంగా లేని ఎస్ఐఆర్ ప్రక్రియను దేశ ప్రజలపై రుద్దడం ఎంతవరకు కరెక్టో బిజెపి ప్రభుత్వం తెలపాలన్నారు.ఎస్సీ ఎస్టీ మైనార్టీ బీసీ ఓట్లను ఎక్కడికక్కడ విచ్చినం చేస్తూ లక్షల కొద్ది ఓట్లను తొలగించడం అనేది రాజకీయ ఎన్నికల ప్రక్రియలో భాగమేన అంటూ సూటిగా నిలదీశారు.ప్రతి రాష్ట్రంలో ఒక్కొక్క నియోజకవర్గంలో వేలకుపైగా ఓట్లు తొలగిస్తే అది ఎన్నికల ప్రక్రియ ఎలా అవుతుందో జాతీయ ఎన్నికల కమిషన్ బహిరంగ ప్రకటన ద్వారా సమాధానం చెప్పాలని సూటిగా నిలదీశారు.అత్యున్నత న్యాయస్థానాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలకు పాల్పడే దురాక్రమణ పరిస్థితులు దేశంలో తాండవించడం చండాలంగా ఉందన్నారు.ప్రభుత్వాల ప్రమేయం లేకుండా ప్రజల అనుమతులు లేకుండా జిల్లా కలెక్టర్లకు సమాచారం లేకుండా లక్షల ఓట్లు తొలగించడం ప్రపంచవ్యాప్తంగా కొత్తరకమైన ఎన్నికల ప్రక్రియను చూస్తున్నామని అదంతా కేవలం బిజెపికి అనుకూలమైన విధానాలను బలోపేతం చేసుకోవడం కోసమే జరుగుతున్న ప్రక్రియలో భాగంగా భావించాల్సి ఉంటుందని ఘాటుగా స్పందించారు.కేవలం ఎన్నికల మోడల్ కూడా కండక్ట్ అమల్లో ఉంటుండగా ఎన్నికల నియమాలు ఆయా రాష్ట్ర పరిధిలో అమలుపరచబడుతుండగా సరిగ్గా అదే సమయంలో లక్షల కొలది ఓట్లు మాయమవడం అదికూడా పది పదిహేను రోజుల వ్యవధిలోనే జరిగిపోతుండడం దేశ ప్రజలు ఎప్పుడూ లేని మోసపూరిత విధానాలను ఎస్ఐఆర్ రూపంలో ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు.చనిపోయిన వ్యక్తులను బ్రతికున్నట్లుగా బ్రతికున్న వ్యక్తులను చనిపోయినట్లుగా ప్రభావితం చూపిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా నిర్మూలించాల్సిందేనట్టు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నప్పటికిని కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎస్ఐఆర్ ప్రక్రియ లేకపోతే గెలవమనేది బలంగా భావిస్తూ జాతీయ ఎన్నికల కమిషన్ పై వస్తున్న అపవాదులను తొలగించడం కోసం సుప్రీంకోర్టు బలాన్ని ఉపయోగించుకుంటూ దేశ ప్రజల మనోభావాలను దేశ ప్రజల ఆత్మ గౌరవాలను దేశ ప్రజల ఓట్లను భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ ఎస్ఐఆర్ రాజకీయ ఎన్నికల విధానాలను బలవంతంగా కొనసాగిస్తూ ప్రజలను అణిచివేస్తుందని తీవ్రంగా మండిపడ్డారు.

### "సర్ "ప్రక్రియపై సర్వత్ర అనుమానాలు.

దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఎన్నికలను శాసిస్తున్నది ఎన్నికల విధానాలను తార్మారు చేస్తున్నది ఎస్ఐఆర్ ప్రక్రియ నంటు స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగించడం కేవలం బిజెపి ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో కొనసాగిస్తున్న బలవంతపు ప్రయోగాలేనని భావించాలన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై అంతటి బలమైన విశ్వాసాన్ని కనపరుస్తున్న బిజెపి ప్రభుత్వం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకంలో తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని సభ్యునిగా పెడుతూ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేదంటే దేశ ప్రజలు తగిన స్థాయిలో బుద్ధి చెప్తారు అంటూ హెచ్చరించారు.ఒక్కొక్క శాఖను గుప్పిట్లో పెట్టుకొని దేశ ప్రజలను నాశనం చేస్తున్న బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎవరికి మేలు చేసిందో బహిరంగంగా చెప్పండి అంటూ సూటిగా నిలదీశారు.ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన ప్రధాన హక్కుగా దేశ పౌరుడు గర్వపడుతున్న సందర్భంలో ఎన్నికల సమయంలో ఆయా శాఖల ప్రభుత్వాలు ఓటు హక్కు వినియోగంపై సభ్యులందరికీ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎక్కువ శాతం ప్రజలు ఓట్లు వినియోగించుకొని ఓట్ల శాతాన్ని పెంచడం కోసం అవగాహన సదస్సులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పెద్ద ఎత్తున ప్రజలను పోలింగ్ బూత్ లోనికి వచ్చి ఓట్లు వేయడానికి సాయశక్తులా కృషి చేస్తూ ఉండగా దానికి పూర్తి భిన్నంగా ఎస్ఐఆర్ ప్రక్రియ లక్షల కొద్ది ఓట్లని తొలగించి జాతీయ ఎన్నికల విధానం దేశ ప్రజలపై కక్షగడుతున్న విధానాలను బలపరుస్తుందని అలాంటి ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం కనుసందల్లో సర్వోన్నత న్యాయస్థానం సహకరించడం చట్టబద్ధతే నంటూ తీర్పునివ్వడం ఆందోళనకరంగా ఉందన్నారు.ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం తెలపకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ బలవంతపు పనులను కేంద్ర ప్రభుత్వం కనుసందల్లో అత్యున్నత న్యాయస్థానం సమర్ధించడం సహకరించడం రాజకీయ ఎన్నికల నియమాలను రాజకీయ ఎన్నికల విలువలను దిగజార్చడమే అన్నారు.సర్ ప్రక్రియ ప్రారంభమైన మొదలుకొని ఇప్పటివరకు పలు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తొలగించబడిన కోట్లాది ఓట్లను కేంద్ర ప్రభుత్వమైన బిజెపి జాతీయ ఎన్నికల కమిషన్ ఐనా బహిరంగంగా తెలియజేస్తూ జాతీయ ఎన్నికల కమిషన్ వెబ్సైట్లో పొందుపరచాలని తద్వారా దేశ ఎన్నికల నియమావళిని సక్రమంగా కొనసాగిస్తున్నారని దేశ ప్రజలు నమ్మే ఆస్కారం ఉంటుందన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియతో దేశవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు ఓట్లు కోల్పోవడమే కాకుండా బిజెపి ప్రభుత్వాన్ని సర్వత్ర విమర్శిస్తున్నారని హెచ్చరిస్తూ అవకాశం దొరికింది కదా అని దేశంలోని అన్ని రాష్ట్రాలను అధోగతి పాలు చేస్తున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పడం కోసం దేశంలో అన్ని రాష్ట్రాల్లో బ్యాలెట్ ఎన్నికల నిర్వహణ కోసం దేశ ప్రజలు కంకణ బద్ధులై ముందుకు సాగాలని ఉద్యమాల ద్వారా తప్ప ఇలాంటి దుర్మార్గం ప్రక్రియలను ఏ విధమైన కోణంలో సాధించుకోలేమని దేశ ప్రజలకు తెలిపారు.

# పదోన్నతి హోదా మాత్రమే కాదు.. బాధ్యత కూడా: సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్, మే 31 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పోలీస్ అధికారులకు పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పదోన్నతి పొందిన పోలీస్ అధికారులను ఆయన అభినందించారు. కమిషనరేట్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ సిరాజ్ పాషా, అలాగే ఏఎస్ఐగా పదోన్నతి పొందిన రాజేంద్ర ప్రసాద్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను పోలీస్ కమిషనర్ అలంకరించారు. ఈ సందర్భంగా సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం హోదా



పెరగడం మాత్రమే కాదని, దానితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా విధులు నిర్వర్తిస్తూ, క్రమశిక్షణతో పనిచేసి ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు.



పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా ప్రతి అధికారి నిబద్ధతతో సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# చిట్ సభ్యులను మోసం చేస్తున్న నార్త్ ఈస్ట్ చిట్ ఫండ్‌పై చర్యలు తీసుకోవాలి గారె వెంకటేష్

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ అనుమతులు, నిబంధనలను ఉల్లంఘిస్తూ చిట్ సభ్యులను మోసం చేస్తున్న నార్త్ ఈస్ట్ చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తక్షణమే చర్యలు తీసుకుని సంస్థను సీజ్ చేయాలని తెలంగాణ చిట్ ఫండ్ బాధితుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గారె వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ ప్యారడైజ్ సర్కిల్‌లో బ్రాంచ్ ఏర్పాటు చేసుకుని నడుస్తున్న నార్త్ ఈస్ట్ చిట్ ఫండ్ వేలాది మంది అమాయక ప్రజలను చిట్ సభ్యులుగా చేర్చుకుని కోట్ల రూపాయలను నెలనెలా వసూలు చేస్తోందని ఆరోపించారు. చిట్ సభ్యులు చిట్ వేలం (ఆక్షన్) నిర్వహించాలని కోరినా సంస్థ యాజమాన్యం స్పందించడం లేదని, తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ డబ్బులు కావాలంటే ఐదు శాతం కంపెనీ కమిషన్ చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. సభ్యులను బెదిరిస్తూ, చిట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒక్క గ్రూపుకు (ఎఫ్‌డీఆర్) మాత్రమే అనుమతి తీసుకుని, అదే బ్రాంచ్ పేరుతో సుమారు 15 గ్రూపులను నిర్వహిస్తూ ప్రభుత్వం మరియు చిట్ సభ్యులను మోసం చేస్తున్నారని గారె వెంకటేష్ ఆరోపించారు.



ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, సంస్థ కార్యకలాపాలను సీజ్ చేసి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే నార్త్ ఈస్ట్ చిట్ ఫండ్‌లో చిట్టీలు వేసి నష్టపోయిన బాధితులందరూ జూన్ 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. చిట్ సభ్యుల నుంచి వసూలు చేసిన సొమ్మును వడ్డీతో సహా తిరిగి ఇప్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, బాధితుల తరఫున న్యాయపరమైన మరియు ప్రజాస్వామ్యపరమైన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రూ.1 కోటి క్లెయిమ్ సెటిల్మెంట్‌తో కుటుంబానికి ఆర్థిక భరోసా

**డాక్టర్ బరిగెల శివ జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్**

హైదరాబాద్‌కు చెందిన ఎస్. సత్యనారాయణ 2018 సంవత్సరంలో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో రూ.1 కోటి టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసు కున్నారు. ఈ పాలసీకి వార్షిక ప్రీమియంగా రూ.48, 500 చెల్లిస్తూ వచ్చారు. దురదృష్టవశాత్తు, మార్చి 2026లో సత్యనారాయణ ఆకస్మికంగా మరణించారు. అయితే ఆయన దూరదృష్టితో తీసుకున్న టర్మ్ పాలసీ కారణంగా, ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా నిలబడేలా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.1 కోటి క్లెయిమ్‌ను పూర్తి స్థాయిలో సెటిల్ చేసి, కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసింది. ఈ క్లెయిమ్ చెక్కును సికింద్రాబాద్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కె. పరమేశ్వర్ రెడ్డి అందజేస్తూ, "ఈ మొత్తం కుటుంబ భవిష్యత్తుకు, ముఖ్యంగా పిల్లల ఉన్నత విద్యకు ఎంతో ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ పార్ట్నర్ చింతపల్లి శ్రీనివాసులు, చీఫ్ బిజినెస్ అసోసియేట్ బర్రె అమరేందర్ రెడ్డి (సిద్దిపేట), అడ్వైజర్లు, లీడర్లు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత అత్యంత అవసరమని, ముఖ్యంగా కుటుంబ పెద్ద అనుకోకుండా దూరమైనప్పుడు కుటుంబం రోడ్డున పడకుండా కాపాడేది టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ మాత్రమేనని




వివరించారు. తక్కువ ప్రీమియంతో భారీ రిస్క్ కవర్ అందించే టర్మ్ పాలసీలు ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ ఘటన మరోసారి నిరూపించింది ఏమిటంటే, ఇన్సూరెన్స్ అనేది ఖర్చు కాదు... కుటుంబ భవిష్యత్తుకు రక్షణ. టర్మ్ పాలసీ అనేది పెట్టుబడి కాదు... మన ప్రియమైన వారి జీవితాలకు భరోసా. "ఈ రోజు మనం ఉన్నాం... రేపు ఏమవుతుందో తెలియదు. కానీ మన కుటుంబం భద్రంగా ఉండాలంటే సరైన ఇన్సూరెన్స్ రక్షణ తప్పనిసరి."

# ప్రభుత్వ రంగంలో తొలి అత్యాధునిక క్యాన్సర్ జీనోమిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నిమ్స్

**హైదరాబాద్ 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో అత్యాధునిక క్యాన్సర్ జెనెటిక్ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రంలో ( నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ ) సాంకేతికత ద్వారా క్యాన్సర్‌కు సంబంధించిన డీఎన్ఏ, ఆర్ఎన్ఏ మార్పులను అత్యంత ఖచ్చితంగా, ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. దీనివల్ల వైద్యులు క్యాన్సర్‌ను మరింత కచ్చితంగా నిర్ధారించి, రోగులకు అత్యంత ప్రభావవంతమైన చికిత్సను ఎంపిక చేయగలుగుతారు. తెలంగాణలో ప్రభుత్వ రంగంలో న్ జి ఎస్ ఆధారిత క్యాన్సర్ నిర్ధారణ సేవలను అందిస్తున్న తొలి ఆసుపత్రి నిమ్స్. ఈ కేంద్రాన్ని ( డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ )--(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ) ఆధ్వర్యంలోని డైమాండ్ఎస్ (ఆరోగ్య పరిశోధనా విభాగం మరియు భారత వైద్య పరిశోధనా మండలి వారి ఆధునిక మాలిక్యులర్ ఆంకాలజీ రోగ నిర్ధారణ సేవలు.) పథకం కింద ఏర్పాటు చేశారు. ఈ జాతీయ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యం. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. భీరప్ప గారు మాట్లాడుతూ ఆరోగ్య పరిశోధనా విభాగం మరియు భారత వైద్య పరిశోధనా మండలి వారి ఆధునిక మాలిక్యులర్ ఆంకాలజీ రోగ నిర్ధారణ సేవలు. పథకం కింద దేశవ్యాప్తంగా సుమారు 25 కేంద్రాలను ఎంపిక చేయగా, ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక కేంద్రం నిమ్స్ అని పేర్కొన్నారు. ఈ అత్యాధునిక ప్రయోగశాలలో అర్హులైన రోగులకు అనేక ఆధునిక క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారు. వీటిలో:

( నెక్స్ట్-జనరేషన్ సీక్వెన్సింగ్" )

మెడికల్/ ల్యాబొరేటరీ రంగంలో: డిజిటల్ డ్రాప్లెట్ మెడికల్/ ల్యాబొరేటరీ రంగంలో (డిజిటల్ డ్రాప్లెట్ పాలిమరేస్ చైన్ రియాక్షన్) మత్స్యము



(ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ ) ఇతర మాలిక్యులర్ డయాగ్నస్టిక్ పరీక్షలు వంటి సేవలు ఉన్నాయి. నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి మరియు డైమండ్ ప్రాజెక్ట్ నాయకుడు డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ మాట్లాడుతూ, 2024 నుంచి ఇప్పటివరకు 1,443 మంది క్యాన్సర్ రోగులు ఈ ఉచిత మాలిక్యులర్ ఆంకాలజీ నిర్ధారణ సేవల ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. వీరిలో 784 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులు, 659 మంది రొమ్ము క్యాన్సర్ రోగులు ఉన్నారని చెప్పారు. ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా సాధారణంగా అధిక ఖర్చుతో కూడుకున్న మరియు సులభంగా అందుబాటులో లేని ఆధునిక క్యాన్సర్ పరీక్షలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రోగులకు నిమ్స్‌లో లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల వైద్యులు మరింత లక్ష్యబద్ధమైన, సమర్థవంతమైన చికిత్సను అందించగలుగుతున్నారు. భవిష్యత్తులో (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ -ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) అనుమతులతో మరిన్ని క్యాన్సర్-నిర్దిష్ట న్ జి ఎస్ పరీక్షలను ప్రవేశపెట్టేందుకు నిమ్స్ ప్రణాళికలు రూపొందిస్తోందని డాక్టర్ ఉప్పిన్ తెలిపారు. అలాగే, సాధారణ రక్తపరీక్ష ద్వారా క్యాన్సర్‌ను గుర్తించడానికి మరియు పర్యవేక్షించడానికి ఉపయోగపడే లిక్విడ్ బయాప్సీ పరీక్షను కూడా ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష ద్వారా వ్యాధి పురోగతిని, చికిత్స ప్రభావాన్ని అంచనా వేయడంతో పాటు క్యాన్సర్ పునరావృతాన్ని ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ కొత్త కేంద్రం ద్వారా తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల క్యాన్సర్ రోగులకు ఆధునిక క్యాన్సర్ నిర్ధారణ సేవలు, మెరుగైన చికిత్స అవకాశాలు మరియు జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ప్రజారోగ్య వ్యవస్థలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుంది.

# రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి: తెలంగాణ రక్షణ సేన



**హైద్రాబాద్, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు బోడ జనార్ధన్, మంచాల వరలక్ష్మి, గొంగళ్ల రంజిత్, సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడారు. ఈ సందర్భంగా బోడ జనార్ధన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పటి వరకు అందులో సగం కూడా కొనుగోలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల సంఖ్యపై ఒక విధంగా, కేంద్ర ప్రభుత్వం మరో విధంగా ప్రకటనలు చేస్తోందని, దీంతో రైతుల్లో అయోమయం నెలకొందని పేర్కొన్నారు. గోనె సంచుల కొరత, గోదాముల సమస్యలు, రవాణా ఇబ్బందులతో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 50 కిలోల ధాన్య బస్తాకు ఐదు కిలోలు తరుగు పేరుతో కోత విధిస్తున్నారని, రైస్ మిల్లర్లు, దళారుల కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగేలా వెంటనే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలంగాణ రక్షణ సేన నాయకులు తెలిపారు.

# సుదీర్ఘ సేవలకు గుర్తింపుగా పోలీసు అధికారులకు ఘన సన్మానం



**వరంగల్, మే 31 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం పాటు వివిధ హోదాల్లో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎస్ఐ ఎం.డి. నజీర్, ఆర్ఎస్ఐ రవికుమార్, ఏఆర్ఎస్ఐలు రమేష్, మల్లారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ, అశోక్‌లను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపికలను అందజేసి పోలీస్ శాఖకు వారు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ రవి మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి అధికారి తన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందిస్తారని అన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే కాకుండా, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ప్రయోజనాల ద్వారా అందే ఆర్థిక లబ్ధులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ముఖ్యంగా ఆ డబ్బును ఇతరులకు అప్పుగా ఇవ్వకుండా కుటుంబ అవసరాలు, భవిష్యత్ భద్రత, ఆరోగ్య పరిరక్షణ కోసం వినియోగించుకోవాలని హితవు పలికారు. పదవీ విరమణ పొందిన అధికారులు తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను, సహచరులతో ఏర్పడిన అనుబంధాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పోలీస్ శాఖలో పనిచేసిన కాలాన్ని జీవితంలో మరపురాని ఘట్టంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీలు శ్రీనివాస్, నాగయ్య, ఆంతయ్య, ఆర్ఐలు సతీష్, శ్రీధర్, ఆర్ఎస్ఐ శ్రావణ్ కుమార్‌తో పాటు పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీలో జూన్ పెన్షన్లకు రూ.2728 కోట్లు విడుదల.. కొత్తగా 5,606 మందికి లబ్ధి

**మొత్తం 62.34 లక్షల మందికి పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు**

**కొత్త పెన్షన్ల కోసం అదనంగా రూ.2.24 కోట్ల కేటాయింపు**

**కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,886 కోట్లు ఖర్చు చేశామని వెల్లడి**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ నెలకు సంబంధించి కొత్తగా 5,606 మందికి స్పౌజ్ కేటగిరీ కింద వితంతు పెన్షన్లను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 62,34,445 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు రూ.2,728 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. కొత్తగా మంజూరు చేసిన 5,606 పెన్షన్ల కోసం అదనంగా రూ.2.24 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుడు మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి వెంటనే అదే నెల నుంచి పెన్షన్‌ను బదిలీ చేసేలా స్పౌజ్ కేటగిరీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జూన్‌తో కలుపుకుని ఇప్పటివరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ.65,886 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. జూన్ 1వ తేదీ ఉదయం నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# డీఈఈసెట్-2026 ఫలితాల విడుదల..

**జూన్ 2 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్**




**హన్మకొండ, 31 మే 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ డీఈఈసెట్--2026 ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. డీఈఎల్ఎడ్ (డి.ఈఐ.ఎడ్), డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఈ) కోర్సుల్లో 2026--28 విద్యా సంవత్సర ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా 84.36 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది 32,592 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 25,054 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 21,137 మంది అర్హత సాధించారు. తెలుగు మాధ్యమంలో 82.37 శాతం, ఇంగ్లిష్ మాధ్యమంలో 88.69 శాతం, ఉర్దూ మాధ్యమంలో 42.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెలుగు మాధ్యమంలో బి. ఆనందు 76 మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించగా, ఇంగ్లిష్ మాధ్యమంలో జవ్వాజీ శివ నాగేశ్వర్ 83 మార్కులతో మొదటి ర్యాంకు పొందారు. ఉర్దూ మాధ్యమంలో దానిష్ అహ్మద్ 66 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. డీఈఈసెట్ ర్యాంక్ కార్డులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రవేశాల ప్రక్రియలో భాగంగా జూన్ 2 నుంచి 5 వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, పదో తరగతి, ఇంటర్మీడియట్ మెమోలు, స్టడీ సర్టిఫికెట్లు, టీసీతో పాటు ఇతర అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అలాగే జూన్ 6 నుంచి 8 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలు, తాజా సమాచారాన్ని డీఈఈసెట్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల, వరంగల్ ప్రిన్సిపాల్ సూచించారు.

# సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యం: ఎస్ఐ ముత్యం రాజేందర్



**రాయపర్తి, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్ అన్నారు. కాట్రపల్లి గ్రామంలో సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మాచారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసు వ్యవస్థ ఎంత కీలక పాత్ర పోషిస్తుందో, ఆ వ్యవస్థకు సహకరించడంలో సీసీ కెమెరాల పాత్ర కూడా అంతే ముఖ్యమని అన్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, గ్రామస్తులు చొరవ తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామంలో జరిగే నేరాలను ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ఏర్పాటు చేసిన కెమెరాలను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసే చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా యువత గంజాయి, గుడుంబా, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కాట్రపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిట్యాల వెంకన్న, కోలుకొండ ప్రశాంత్, మహమ్మద్ అఫీజా అన్వర్, గుమ్మడి రాజు, ఎలేంద్ర వెంకన్న, వేల్పుగొండ ఉమా బిక్షపతి, గ్రామ ప్రజలు, రైతులు, యువకులు, హార్వెస్టర్ యూనియన్, ఆటో యూనియన్, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నిసార్లు దొరికిపోయినా మీ కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా జగన్?: నారా లోకేష్

**నంద్యాల, జై భీమ్ న్యూస్**

వైసీపీ అధినేత జగన్ పై మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను రంగంలోకి దింపారని లోకేష్ ఆరోపించారు. జగన్ నాటకాలు చూసి ప్రజలు విసిగిపోయినా, ఆయన తన డ్రామాలు ఆపడం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. నంద్యాలలో ఇటీవల జరిగిన వైఎస్సార్ విగ్రహ ధ్వంసం ఘటనను ప్రస్తావిస్తూ, దీని వెనుక వైసీపీ కుట్ర ఉందని లోకేష్ ఆరోపించారు. ఈ ఘటనలో నిందితుడైన జమ్ములయ్య, స్థానిక వైసీపీ నేతల అనుచరుడేనని పోలీసుల విచారణలో తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉటంకిస్తూ, జగన్ తన 'గొడ్డలి పార్టీ' కార్యకర్తలతో అశాంతి సృష్టిస్తున్నారని విమర్శించారు. బాబాయ్ గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి వంటి నాటకాలతో ప్రజలను మోసం చేసిన జగన్, ఇప్పుడు కూడా అదే తరహా కుట్ర రాజకీయాలు చేస్తున్నారని లోకేష్ మండిపడ్డారు. "ఎన్నిసార్లు దొరికిపోయినా మీ కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా జగన్?" అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. అధికారంలో లేకపోయినా జగన్ తీరు మారడం లేదని లోకేష్ వ్యాఖ్యానించారు.

# పంట పొలాల్లో మంటలు రేపుతున్నదెవడు..?

**ప్రజలను ఇంతలా ఇబ్బందిపెడుతున్న మారని తీరు**
**స్వయంగా ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షించినా ఆగని దహనకాండ**
**అంబాల గ్రామ శివారులో పొలాలకు మంటలు.. భయం గుప్పిట్లో ప్రజలు**
**ఆనందం ముసుగులో ఆగంతకుడు.. పొగలు విస్తృతంగా వ్యాపించడంతో ఆందోళన**
**చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు.. మారని రైతుల తీరు**
**సంబంధిత శాఖల నిర్లక్ష్యంపై పలు విమర్శలు**

**హనుమకొండ జిల్లా/కమలాపూర్, 31 మే 2026 (జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ మండలం అంబాల గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలుచోట్ల వ్యవసాయ పొలాల్లో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కోత పూర్తయిన అనంతరం పొలాల్లో మిగిలిపోయిన పంట అవశేషాలను దహనం చేయడంతో మంటలు వేగంగా వ్యాపించి విస్తారమైన భూభాగాన్ని ఆవరించాయి. గాలుల ప్రభావంతో మంటలు ఒక పొలం నుంచి మరో పొలానికి వ్యాపించడమే కాకుండా భారీగా ఎగసిపడిన పొగలు గ్రామ పరిసర ప్రాంతాలను పూర్తిగా కమ్మేశాయి. పంట అవశేషాల దహనాన్ని అరికట్టేందుకు అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొందరు రైతుల తీరు మాత్రం మారడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల స్వయంగా ఏసీపీ స్థాయి అధికారి గ్రామాల్లో పర్యటిస్తూ పంట అవశేషాలను కాల్చవద్దని అవగాహన కల్పించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించకపోవడం గమనార్హం. అధికారుల సూచనలను బేఖాతరు చేస్తూ కొందరు వ్యక్తులు తమ పనులు త్వరగా పూర్తవ్వాలనే ఉద్దేశంతో పంట అవశేషాలకు నిప్పంటిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, పర్యావరణంపై ప్రభావం పడుతున్నా కొందరు రైతులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. మంటల కారణంగా వెలువడిన దట్టమైన పొగలు గ్రామం వైపు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పొగలతో వాతావరణం పూర్తిగా మసకబారిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి



బయటకు రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రాత్రి సమయంలో అగ్నికీలలు ఎగసిపడుతుండటం, దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేయడంతో గ్రామస్తులు భయంతో గడిపారు. మంటల వెలుగు దూర ప్రాంతాల నుంచి కూడా కనిపించడంతో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగిందేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో రైతులు కొత్త సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పంట అవశేషాలను తొలగించేందుకు సులభ మార్గంగా వాటిని కాల్చివేయడం జరుగుతోంది. అయితే ఈ చర్యల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా నేలలోని సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా గాలిలో కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. పంట అవశేషాల దహనం వల్ల నేల సారవంతత తగ్గి భవిష్యత్ పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ శివారులో గంటల తరబడి మంటలు మండుతుండగా పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ మరియు అగ్నిమాపక శాఖల అధికారులు కేవలం పరిశీలనకే పరిమితమయ్యారని విమర్శిస్తున్నారు. మంటలు మరింత విస్తరించి సమీపంలోని చెట్లు, పశువుల మేత భూములు, విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ పరికరాలు, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని వాపోతున్నారు. పొలాల్లో మంటలు వ్యాపిస్తున్న సమయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పంట అవశేషాల దహనంపై నిషేధం విధించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు లోపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏడాది ఇదే తరహా ఘటనలు పునరావృతమవుతున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంట అవశేషాల దహనంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అంబాల గ్రామ శివారులో చోటుచేసుకున్న ఈ ఘటనతో గ్రామ ప్రజలు భయం గుప్పిట్లో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట పొలాల్లో మంటలు రేపుతున్న వారు ఎవరైనా సరే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టి బాధ్యులను శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# పొగాకు వినియోగం ప్రాణాలకు ముప్పు: డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య





**హన్మకొండ, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఏ. అప్పయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో అవగాహన సదస్సు, పోస్టర్ల ప్రదర్శనతో పాటు హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ పార్కులు, సినిమా హాళ్లు, మార్కెట్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం వల్ల చుట్టుపక్కల ఉన్నవారి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పోలీస్ శాఖ సహకారంతో నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారికి సిగరెట్ మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం (కాట్పా) సెక్షన్-4 ప్రకారం జరిమానాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యాసంస్థల పరిసరాల్లో 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు వివిధ శాఖల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జాతీయ అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఎంజీఎం ఆసుపత్రిలో క్యాన్సర్ డే కేర్ సెంటర్ అందుబాటులో ఉందని తెలిపారు. శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామక శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు వినియోగంలో భారత్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది పొగాకు సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారని, ఇవి నివారించగల మరణాలేనని పేర్కొన్నారు. ప్రజల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత అవసరమని అన్నారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల ఊపిరితిత్తులతో పాటు శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు దెబ్బతింటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రాజిరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ డి-అడిక్షన్ సెంటర్ నిర్వాహకుడు రాము, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, ఎన్‌సీడీ సోషల్ వర్కర్ నరేష్, సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వాకర్స్, పలువురు సందర్శకులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కులే సమాజ అభివృద్ధికి పునాది: డా. మేరుగు రాధాకృష్ణ గౌడ్



**హన్మకొండ, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజారోగ్య పరిరక్షణ, ఆహార భద్రత, వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి చైతన్యవంతంగా ముందుకు రావాలని ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ వైస్ చైర్మన్ డా. మేరుగు రాధాకృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించడంతో పాటు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం కాలానుగుణ అవసరంగా మారిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆహార కల్తీ, నకిలీ ఉత్పత్తుల తయారీ, నాణ్యతలేని వస్తువుల విక్రయం ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిణమించిందన్నారు. మార్కెట్‌లో లభ్యమవుతున్న ఆహార పదార్థాలు, మందులు, నిత్యావసర వస్తువుల కొనుగోలు సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఉత్పత్తులపై పేర్కొన్న గడువు తేదీలు, నాణ్యతా ప్రమాణాలు, తయారీ వివరాలు పరిశీలించిన తరువాతే కొనుగోలు చేయాలని తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ జాతీయ అధ్యక్షులు డా. సాయి రమేష్ గౌడ్ మార్గదర్శకత్వంలో సంస్థ మరింత చురుకుగా పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రజారోగ్యం, ఆహార భద్రత, వినియోగదారుల హక్కులు, సామాజిక బాధ్యతలపై అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, ప్రచార యాత్రలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం, భద్రమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ శాఖలు, ఆహార భద్రత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా మాత్రమే సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోగలమని అభిప్రాయపడ్డారు. యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఆరోగ్య పరిరక్షణ, మత్తు పదార్థాల నివారణ, వినియోగదారుల హక్కుల సాధన వంటి అంశాల్లో యువత ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, ఆహార కల్తీ నిర్మూలన, వినియోగదారుల హక్కుల సాధన కోసం ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ నిరంతరం కృషి చేస్తోందని డా. మేరుగు రాధాకృష్ణ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు తన బాధ్యతలను కూడా గుర్తించి సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యమే దేశ సంపద.. వినియోగదారుల హక్కుల పరిరక్షణే సమాజ అభివృద్ధికి పునాది అని డా. మేరుగు రాధాకృష్ణ గౌడ్ పేర్కొన్నారు.

# 'రుద్రమ' బ్రాండ్‌తో మహిళా సాధికారతకు కొత్త ఊపు: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. దామెర మండలం ల్యాదల్ల గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీ-హబ్ (వీ హబ్) సీఈవో సీతా పల్లాచోళ్లతో కలిసి ఎస్‌హెచ్‌జీ వీవో వర్క్‌షెడ్, జీఎం డెయిరీ, సమావేశ మందిర భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సమాఖ్య సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా 'రుద్రమ' బ్రాండ్ పేరుతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించడం గర్వకారణమని అన్నారు. ల్యాదల్ల గ్రామంలో డెయిరీ యూనిట్ ప్రారంభం కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న మహిళల కల నేడు సాకారమైందన్నారు. 'రుద్రమ' బ్రాండ్ తెలంగాణ మహిళల ఆర్థిక స్వావలంబనకు, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం లక్ష్యంగా ఈ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఆధునిక నైపుణ్యాలు నేర్పించి, స్థానికంగా చిన్న తరహా తయారీ యూనిట్లలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీ-హబ్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మహిళా శక్తి' వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతం, గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఇటువంటి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళల్లో అంకితభావంతో పనిచేసే శక్తి అపారంగా ఉందని, ఇక్కడ అందించే శిక్షణను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి 'రుద్రమ' బ్రాండ్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని సూచించారు. తెలంగాణ చరిత్రలో వీరోచిత పోరాటాలకు ప్రతీకగా నిలిచిన రాణి రుద్రమదేవి స్ఫూర్తితో ఈ బ్రాండ్‌కు 'రుద్రమ' అనే పేరు పెట్టడం అభినందనీయమని అన్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు పెరిగేలా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఉత్పత్తులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మార్కెట్‌ను అందుకునేలా వీ-హబ్ నిర్వాహకులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నిజాయితీ, నిబద్ధతనే పెట్టుబడిగా తీసుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీ-హబ్ ప్రతినిధులు, జిల్లా అధికారులు, మహిళా సంఘాల నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## గడువులోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని గడువులోగా పూర్తిగా సేకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. అలాగే పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఆదివారం ఖానాపూర్ మండలంలోని మనుబోతుల తండా, పెద్దమ్మగడ్డ తండా, ఖానాపూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ పురోగతి, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హమాలీల అందుబాటు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. హమాలీల కొరత కారణంగా ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో జాప్యం జరుగుతోందని రైతులు వివరించగా, కొనుగోలు పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అవసరమైన కేంద్రాలకు వెంటనే తరలించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులకు పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించడంతో పాటు భూసారం తగ్గిపోతుందని, తద్వారా భూమి సారవంతత దెబ్బతిని భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. పర్యటనలో భాగంగా ఖానాపూర్ మండలంలోని శ్రీనివాసరావు రైస్ మిల్, సాయి కృష్ణ రైస్ మిల్, గోపీకృష్ణ ఆగ్రో ఏజెన్సీలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం బస్తాల నాణ్యత, తూకాలు, రికార్డులు, రసీదులను పరిశీలించి సంబంధిత నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తూకాలు సక్రమంగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పూర్తి పారదర్శకత పాటించాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పట్టా పాస్‌బుక్ పోగొట్టుకున్న బాధితురాలు.. దొరికితే అప్పగించాలని విజ్ఞప్తి




**ఎల్కతుర్తి, 31 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఎల్కతుర్తి మండలంలోని కేశపూర్ గ్రామ శివారులో గల వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్ పోగొట్టుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. బాధితుల కథనం ప్రకారం, కేశపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 242/ఏలో గల 11 గుంటల వ్యవసాయ భూమిని చంద్రగిరి కొమురయ్య వద్ద నుంచి అనిత (భర్త శ్రీకాంత్) కొనుగోలు చేశారు. ఆ భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్ నంబర్ టి21030131635, ఖాతా నంబర్ 60575 గల పట్టా పాస్‌బుక్ జిరాక్స్ చేయించే సమయంలో లేదా ఎల్కతుర్తి నుంచి హనుమకొండకు బస్సులో ప్రయాణిస్తున్న క్రమంలో ఎక్కడో మిస్ అయినట్లు బాధితురాలు తెలిపారు. పాస్‌బుక్ కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పట్టా పాస్‌బుక్ ఎవరికైనా దొరికినట్లయితే తమకు అందజేయాలని లేదా సమాచారం ఇవ్వాలని బాధితురాలి కుటుంబ సభ్యురాలు నల్లతీగల మల్లికాంబ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. సమాచారం తెలిసిన వారు 98493 52471 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు

అధికారికంగా ప్రకటించాలి: కవిత డిమాండ్

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత

రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ

ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ. 25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రాణాంతక పదార్థాలను పారదోలాలి

తంబాకు హానికరం

ప్రజల ప్రాణాలను నిలువునా తోడేస్తుంది

స్లమ్ ఏరియా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కార్మికులు తంబాకుకు అలవాటు పడొద్దు

తంబాకు అలవాటు ప్రాణాలతో చెలగాటం-డాక్టర్ అనితా రెడ్డి



**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

ఆరోగ్యానికి హానికరమైన పొగాకు పదార్థాలను ఏమాత్రం వాడకూడదని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనిత రెడ్డి పిలుపునిచ్చారు.అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి తంబాకు నిర్మూలన కోసం విస్తృతంగా ప్రచారం చేస్తూ స్లమ్ ఏరియా దర్శించడమే కాకుండా రోజు మొత్తం ప్రజలకు అవగాహన కల్పించడం ప్రత్యేక కార్యక్రమంలో పెట్టుకున్నారు.ఆదివారం రోజు ప్రపంచ తంబాకూ నిరోధక దినోత్సవం సందర్భంగా ఆటో డ్రైవర్స్ , స్లమ్ ఏరియా వాసులకు ఈ దినోత్సవంపై అవగాహన కల్పించిన- డాక్టర్ అనితా రెడ్డి ,వరల్డ్ టొబాకో డే సందర్భంగా మాట్లాడుతూ తంబాకూ అలవాటు ప్రాణాలతో చెలగాటం అన్నారు, తంబాకూ వాడకాన్ని తగ్గించేందుకు ప్రజల్లోఅవగాహన పెంచడం అలాగే పిల్లలను తంబాకూ పరిశ్రమల ప్రభావం నుండి రక్షించడం మన సమాజానికి అత్యంత అవసరం. తంబాకూ వాడకం వల్ల ప్రతి ఏడాదీ కోట్లాది మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు, కాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని తంబాకూ వాడకాన్ని నియంత్రించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య నిపుణులు ఉపాధ్యాయు లు మరియు ప్రతి పౌరుడు కలిసికట్టు గా పనిచేయాలని, సమిష్టి కృషితో నివారణ సాధ్యం అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, ఒక సామాజిక బాధ్యత కూడా. తంబాకూ వాడకం వాడేవాళ్లకే కాకుండా వారి కుటుంబాలకు కూడా హానికరం అని అన్నారు, తంబాకు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, కుటుంబాలను ఆగం చేసుకోవద్దని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి,, వెంకన్న, మంగ , రాఘవ,స్లమ్ వాసులు, ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.



## తెలంగాణలో డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగింపు... ఎప్పటివరకు అంటే...!

తీవ్ర వడగాడ్పుల కారణంగా వేసవి సెలవులు పొడిగింపు

జూన్ 1కి బదులుగా 6, 8 తేదీల్లో తరగతులు ప్రారంభం

ఉస్మానియా, కాకతీయ సహా పలు వర్సిటీల పరిధిలో ఈ నిర్ణయం అమలు

విద్యార్థులు, అధ్యాపకులకు ఊరటనిచ్చిన యూనివర్సిటీల ప్రకటన

పరిపాలన సిబ్బంది మాత్రం యధావిధిగా విధులకు హాజరు కావాలని ఆదేశాలు





**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో తీవ్రమైన వడగాలుపుల కారణంగా తెలంగాణలోని యూనివర్సిటీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులను జూన్ 6వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించాయి. వాస్తవానికి జూన్ 1న కాలేజీలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా, తాజా నిర్ణయంతో జూన్ 6 నుంచి 8వ తేదీ మధ్య తరగతులు మొదలవుతాయి. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని క్యాంపస్, అనుబంధ కాలేజీలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ వర్సిటీలు సెలవులను జూన్ 6 వరకు పొడిగించగా, జూన్ 7 ఆదివారం కావడంతో జూన్ 8న కాలేజీలు తెరుచుకుంటాయి. మరోవైపు, కాకతీయ, శాతవాహన వర్సిటీలు జూన్ 5 వరకు సెలవులు ప్రకటించి, జూన్ 6న తరగతులు ప్రారంభించనున్నాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన వేసవి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీలు తమ సర్క్యులర్లలో పేర్కొన్నాయి. అయితే, ఈ సెలవులు విద్యార్థులు, టీచింగ్ సిబ్బందికి మాత్రమే వర్తిస్తాయి. ప్రిన్సిపాల్స్, పరిపాలన బాధ్యతల్లో ఉన్న సిబ్బంది యధావిధిగా విధులకు హాజరు కావాలని స్పష్టం చేశాయి. ఇప్పటికే రాష్ట్రంలో పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు పొడిగించిన విషయం తెలిసిందే. అధ్యాపక సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ తెలిపింది. వాతావరణ శాఖ పలు జిల్లాలకు వడగాలుపుల హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో, ఈ అదనపు సెలవులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిస్తున్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# గండిపేట భూ కుంభకోణం..

**బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్**
**గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర**
**ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు**
**నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి**
**ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు**
**మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు. డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



# క్యాన్సర్ చికిత్సలో నిమ్స్ మరో ముందడుగు..

## ఖరీదైన పరీక్షలు ఇక ఉచితం

**హైదరాబాద్ నిమ్స్‌లో త్వరలో లిక్విడ్ బయాప్సీ సేవలు ప్రారంభం**
**రక్త నమూనాతోనే క్యాన్సర్ దశ, తీవ్రతను గుర్తించే ఆధునిక పరీక్ష**
**ఇప్పటికే 1443 మందికి ఉచితంగా ఎన్‌జీఎస్ జన్యు పరీక్షలు పూర్తి**
**ఆరోగ్యశ్రీ కింద ఈ ఖరీదైన పరీక్షలన్నీ ఉచితంగా అందించనున్నట్లు వెల్లడి**
**పేద, మధ్యతరగతి రోగులకు ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్యం అందించడమే లక్ష్యం**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి, రోగికి ప్రత్యేకమైన చికిత్స అందించే లక్ష్యంతో మరో కీలక ముందడుగు వేసింది. అత్యాధునిక 'లిక్విడ్ బయాప్సీ' పరీక్షలను త్వరలోనే రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రకటించారు. కేవలం రక్త నమూనా ద్వారానే క్యాన్సర్ దశ, దాని తీవ్రతను గుర్తించే ఈ విప్లవాత్మక సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తిగా ఉచితంగా అందించనుండటం క్యాన్సర్ రోగులకు పెను ఊరటనిచ్చే అంశం. సాధారణంగా క్యాన్సర్ నిర్ధారణకు కణితి నుంచి కొంత భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తీసి 'టిష్యూ బయాప్సీ' చేస్తారు. ఇది రోగికి కొంత బాధ కలిగించే ప్రక్రియ. దీనికి భిన్నంగా, లిక్విడ్ బయాప్సీ విధానంలో కేవలం ఒక రక్తపు చుక్కతోనే శరీరంలో వ్యాపించిన క్యాన్సర్ కణాల డీఎన్‌ఏను విశ్లేషించి వ్యాధి తీవ్రతను గుర్తిస్తారని నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ వివరించారు. దీనివల్ల రోగికి ఎలాంటి కోత, శస్త్రచికిత్స అవసరం ఉండదు. ఇప్పటికే నిమ్స్‌లోని క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్‌లో 'నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్' (ఎన్‌జీఎస్) టెక్నాలజీతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ 'డైమండ్ ప్రాజెక్టు'లో భాగంగా ఈ సేవలను ప్రారంభించారు. క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన మార్పులను గుర్తించి, రోగి శరీరతత్వానికి అనుగుణంగా 'టార్గెటెడ్ థెరపీ' అందించడానికి ఈ పరీక్షలు కీలకం. 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 1,443 మంది రోగులకు ఈ ఖరీదైన జన్యు పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించి, వారికి మెరుగైన చికిత్స అందించినట్లు డాక్టర్ బీరప్ప తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఎన్‌జీఎస్, లిక్విడ్ బయాప్సీ వంటి అత్యంత ఆధునిక పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రిలో, అదీ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. ప్రభుత్వ మద్దతుతో నిమ్స్ అందిస్తున్న ఈ ప్రపంచస్థాయి వైద్య సేవలు, ఎందరో పేద, మధ్యతరగతి క్యాన్సర్ బాధితులకు పునర్జన్మను ప్రసాదించనున్నాయని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

# చల్లని కబురు.. మరో పది రోజుల్లో తెలంగాణకు నైరుతి రుతుపవనాలు!

**కేరళ, తమిళనాడు వైపు వేగంగా విస్తరిస్తున్న గాలులు**
**రాష్ట్రంలో క్రమంగా తగ్గనున్న పగటి ఉష్ణోగ్రతలు**
**ఈరోజు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (×వీణ) వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహేగాన్‌లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36–38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40–42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38–39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# బాల్యవివాహాలు, గృహహింస.. దక్షిణాదిన తెలంగాణలోనే అత్యధికం

**భారతీయుల గుండె లయ తప్పుతోందన్న జాతీయ సర్వేలు**
**దేశంలో 60 శాతానికి పైగా మరణాలకు అసాంక్రమిక వ్యాధులే కారణం**
**ఆందోళనకరంగా పెరుగుతున్న గుండె జబ్బులు, మధుమేహం, ఊబకాయం కేసులు**
**మహిళల్లో గణనీయంగా పెరిగిన ఇంటర్నెట్ వాడకం, బ్యాంకు ఖాతాలు**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

దేశంలో మారుతున్న జీవనశైలి ప్రజల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది. జాతీయ 'నమూనా రిజిస్ట్రేషన్ వ్యవస్థ' (ా=ూ), జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (చీఖీనూ–6) విడుదల చేసిన తాజా నివేదికలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో సంభవిస్తున్న మొత్తం మరణాలలో 60 శాతానికి పైగా గుండె జబ్బులు, క్యాన్సర్, శ్వాసకోశ సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధుల (చీజణ) వల్లే జరుగుతున్నాయని ఈ సర్వేలు తేల్చాయి. నివేదికల ప్రకారం.. దేశంలో అసాంక్రమిక వ్యాధుల మరణాల్లో ఏకంగా 32.1 శాతం కేవలం గుండె జబ్బుల కారణంగానే సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం కేసులు తీవ్ర ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. పురుషుల్లో మధుమేహుల సంఖ్య 20.9 శాతానికి, మహిళల్లో 17.8 శాతానికి చేరింది. మరోవైపు, 15–29 ఏళ్ల యువతలో ఆత్మహత్యల మరణాలు 19 శాతానికి పెరగడం కలచివేస్తోంది. అయితే, అంటువ్యాధుల మరణాలు తగ్గడం, రక్తపోటు సమస్య స్వల్పంగా నియంత్రణలో ఉండటం కొంత ఊరటనిచ్చే అంశం. ఈ సర్వేలో మహిళల సామాజిక–ఆర్థిక స్థితిగతులపై ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో ఇంటర్నెట్ వినియోగించే మహిళల సంఖ్య 33.3 శాతం నుంచి 64.3 శాతానికి పెరిగింది. ఈ విషయంలో కేరళ (87.3 శాతం) అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణ (64.8 శాతం), ఆంధ్రప్రదేశ్ (63.6 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దాదాపు 89 శాతం మంది మహిళలకు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. అయితే, మహిళలు ఆర్థికంగా ముందడుగు వేస్తున్నప్పటికీ బాల్యవివాహాలు, గృహహింస వంటి సామాజిక రుగ్మతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటికీ 20 శాతం బాల్య వివాహాలు జరుగుతుండగా, 22.3 శాతం మంది మహిళలు భర్తల నుంచి గృహహింసను ఎదుర్కొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా 30.8 శాతం మంది మహిళలు గృహహింస బాధితులుగా ఉన్నట్లు సర్వేలో తేలింది.

# మంత్రాలయం వద్ద విషాదం..

**తుంగభద్రలో ఐదుగురు గల్లంతు**
**మృతుల్లో ఐదేళ్ల బాలుడు, హైదరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు**
**సత్యనారాయణ వ్రతం తర్వాత స్నానానికి వెళ్లి ప్రమాదం**
**గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు**
**ప్రమాదం నుంచి బయటపడిన అపర్ణ**



కర్నూలు, జై భీమ్ న్యూస్


కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో బంధువుల ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

# సూపర్ స్టార్ సేవలు చిరస్మరణీయం..

**కృష్ణకు సీఎం చంద్రబాబు ఘన నివాళి**
**సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా నివాళు లర్పించిన సీఎం చంద్రబాబు**
**తెలుగు సినిమాకు కృష్ణ సేవలు మరువలేనివని కొనియాడిన సీఎం**
**నూతన సాంకేతికతను పరిశ్రమకు పరిచయం చేశారని ప్రశంస**

విజయవాడ, జై భీమ్ న్యూస్

సూపర్ స్టార్, పద్మభూషణ్ ఘట్టమనేని కృష్ణ జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలుగు సినీ పరిశ్రమకు కృష్ణ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను ఓ గొప్ప నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా కొనియాడారు. కృష్ణ జయంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. తెలుగు సినిమాకు నూతన సాంకేతికతను పరిచయం చేయడంలో కృష్ణ ముందున్నారని, ఆయన కృషితోనే తెలుగు సినిమా కొత్త పుంతలు తొక్కిందని చంద్రబాబు ప్రశంసించారు. సినీ రంగ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. "తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నాం. నూతన సాంకేతికతలను తెలుగు సినిమాకు పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు" అని సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.



# తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి వ్యాఖ్యలను ఖండించిన చంద్రబాబు

**బక్కని నర్సింహులు వ్యాఖ్యలను తప్పుపట్టిన సీఎం చంద్రబాబు**
**చారిత్రక ప్రాంతాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరమని హితవు**
**'గొడ్డలి పార్టీ' అనే పేరుతో వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందన్న సీఎం**
**వివేకా హత్య కేసులో సునీత పోరాటానికి సంపూర్ణ మద్దతు**
**నియోజకవర్గాలను 50 శాతం పెంచితే రాష్ట్రానికి నష్టం ఉండదని సూచన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు తప్పుపట్టారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు నేతలు సంయమనం పాటించాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీయకూడదని ఆయన హితవు పలికారు. "తెలంగాణ అనే పదం నిఘంటువులోనే లేదు" అంటూ బక్కని ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు ఈ స్పష్టత ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. తెలుగు జాతి ఒక్కటేనని, తెలంగాణలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని స్పష్టం చేశారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్ లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. 'గొడ్డలి పార్టీ' అనే పేరు ప్రజల్లోకి బలంగా వెళుతుండటంతో వారిలో ఫ్రస్టేషన్ పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. వైఎస్ కుటుంబ అరాచకాలు తమకు కూడా పూర్తిగా తెలియవని, ఇలాంటి వారు ప్రజాస్వామ్యానికి పనికిరారని అన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటానికి చంద్రబాబు మద్దతు తెలిపారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని, ఆమె పోరాటం వల్లే ఈ కేసు



ఇంకా సజీవంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పట్టుదలగా ఉందని, అవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తెస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పునర్విభజనలో రాష్ట్రానికి నష్టం జరగకుండా ప్రస్తుతమున్న స్థానాలను 50 శాతం పెంచితే మేలు జరుగుతుందని సూచించారు.

# సాత్విక్-చిరాగ్ జోడీకి వరల్డ్ టైటిల్

**అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్**
**సింగపూర్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న సాత్విక్-చిరాగ్**
**ఫైనల్‌లో ఇండోనేషియా జోడీపై విజయం**
**తొలి గేమ్ కోల్పోయినా అద్భుత పునరాగమనం**
**73 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరు**
**స్పందించిన చంద్రబాబు, మంత్రి నారా లోకేష్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సింగపూర్‌లో చారిత్రక విజయం సాధించడం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. కేఎఫ్ఎఫ్ సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న ఈ జోడీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టిల చారిత్రక విజయం పట్ల గర్వంగా ఉంది. మీ అద్భుతమైన గెలుపు, ఆధిపత్య ప్రదర్శన మీ అంకితభావం, పట్టుదల, నైపుణ్యానికి నిదర్శనం" అని కొనియాడారు. ప్రపంచ వేదికపై మరోసారి భారతదేశాన్ని గర్వపడేలా చేశారని, దేశంలోని లక్షలాది మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా, ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ బిడ్డ అయిన సాత్విక్‌సాయిరాజ్ రాష్ట్రానికి గొప్ప కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చారని చంద్రబాబు ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ చిరస్మరణీయ విజయం సందర్భంగా ఇద్దరు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, భవిష్యత్తులో వారు మరెన్నో విజయాలు, మైలురాళ్లు సాధించాలని ఆకాంక్షించారు.

**హర్షం వ్యక్తం చేసిన లోకేష్**

భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలన ప్రదర్శనతో అదరగొట్టారని ఏపీ మంత్రి నారా లోకేష్ కొనియాడారు. కేఎఫ్ఎఫ్ సింగపూర్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్ టైటిల్‌ను ఈ జోడీ కైవసం చేసుకుందని, ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్, మహ్మద్ షోహిబుల్ ఫిక్రీ ద్వయంపై గెలుపొందారని వివరించారు. సుమారు 73 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో సాత్విక్-చిరాగ్ 18-21, 21-17, 21-16 తేడాతో విజయం సాధించడం అమోఘం అని లోకేష్ ప్రశంసించారు. తొలి గేమ్ కోల్పోయి వెనుకబడినప్పటికీ, అసాధారణ పోరాట పటిమతో పుంజుకుని మిగిలిన రెండు గేములను గెలుచుకోవడం విశేషం అని, వారి దూకుడైన ఆటతీరు ముందు ప్రత్యర్థులు నిలవలేకపోయారని తెలిపారు. ఈ విజయంపై భారత జోడీకి అభినందనలు తెలుపుతున్నట్టు ట్వీట్ చేశారు. "73 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ స్వచ్ఛమైన బ్యాడ్మింటన్ డ్రామా. తొలి గేమ్ ఓడిపోయినా, ఆ తర్వాత మన క్రీడాకారులు అద్భుతమైన పట్టుదల ప్రదర్శించారు. ఛాంపియన్లకు నా అభినందనలు" అంటూ వారిని కొనియాడారు.

# పీఎం సేతు పథకం అమలులో ఏపీ ఫస్ట్..

**విశాఖ ఐటీఐ క్లస్టర్‌కు కేంద్రం ఆమోదం**
**పీఎం సేతు పథకం అమలులో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్**
**విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం**
**ఆర్సెలర్ మిట్టల్, నామ్‌టెక్ భాగస్వామ్యంతో ఐటీఐల ఆధునీకరణ**
**పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యం**
**దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను అభివృద్ధి చేసేందుకు రూ. 60,000 కోట్ల పథకం**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం-సేతు) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ పథకం కింద విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు (ఎస్ఐపీ) కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ (ఎన్ఎస్‌సీ) ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పీఎం-సేతు కింద ఆమోదం పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ప్రముఖ ఉక్కు తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా), న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో ఆధునీకరిస్తారు. పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక శిక్షణ అందిస్తారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 60,000 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించింది. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం మొదటగా ప్రారంభం కానుండటంతో, ఇది ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.



# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా: జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు వైసీపీ వినతి

**సానుకూలంగా నివేదిక ఇచ్చి వారికి న్యాయం చేయాలని డిమాండ్**
**మతం మారినంత మాత్రాన సామాజిక వివక్ష పోదని నేతల వాదన**
**ఢిల్లీలో కమిషన్‌ను కలిసిన ఎంపీ గురుమూర్తి నేతృత్వంలోని బృందం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

దేశవ్యాప్తంగా ఉన్న దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పించాలని వైసీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నిన్న ఢిల్లీలో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్‌ను కలిసిన వైసీపీ ప్రతినిధి బృందం ఒక వినతిపత్రం సమర్పించింది. దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా కమిషన్ సానుకూల నివేదిక ఇవ్వాలని నేతలు కోరారు. అనంతరం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఎంపీ గురుమూర్తి, షెడ్యూల్డ్ కులాలకు అందుతున్న అన్ని హక్కులు, రక్షణలు దళిత క్రైస్తవులకు కూడా వర్తింపజేయాలని అన్నారు. మతం మారినప్పటికీ దళితులు సామాజికంగా, ఆర్థికంగా వివక్షను ఎదుర్కొంటున్నారని,



కాబట్టి వారికి ఎస్సీ హోదా నిరాకరించడం సరికాదని నేతలు వాదించారు. మతం ఆధారంగా వివక్ష చూపడం ఆగిపోవాలని, దళితుల హక్కుల పరిరక్షణలో కేంద్రం సమానత్వంతో వ్యవహరించాలని ఎంపీ గొల్ల బాబూరావు విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై గతంలో వైసీపీ ప్రభుత్వం ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు, మాజీమంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, మాజీ ఎంపీ నందిగం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సార్ ముందు మనసు విప్పి మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా: బండ్ల గణేష్

**పవన్ కల్యాణ్ పై మరోసారి తన అభిమానాన్ని చాటుకున్న బండ్ల గణేష్**
**పవన్ గురించి మనసు విప్పి మాట్లాడే అవకాశం కోసం ఎదురుచూస్తున్నానని వెల్లడి**
**ఆయన గొప్పదనం, వ్యక్తిత్వం గురించి ప్రపంచానికి చెబుతానని వ్యాఖ్య**
**పదవులు కాదు, వ్యక్తిత్వమే ముఖ్యమని నిరూపించిన వ్యక్తి పవన్ అని కితాబు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ మరోసారి పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై తనకున్న ప్రగాఢ అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ గురించి మనసు విప్పి మాట్లాడే అవకాశం కోసం తాను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నానని ఆయన అన్నారు. ఆ రోజు వచ్చినప్పుడు పవన్ గొప్ప మనసు, వ్యక్తిత్వం గురించి తనకు తెలిసిన నిజాలను ప్రపంచం ముందు గర్వంగా చెబుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ సార్ గురించి నాకు తెలిసిన నిజాలను, ఆయన క్యారెక్టర్‌ను, ఆయన నైజాన్ని ప్రపంచానికి చెప్పే అవకాశం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాను. పదవులు, హోదాలు కాదు.. మనిషి విలువ అతని ప్రవర్తన, మాట, మనసులో ఉంటుందని నిరూపించిన వ్యక్తి ఆయన" అని ప్రశంసించారు. అలాంటి మహోన్నత వ్యక్తి గురించి తన హృదయంలో ఉన్న గౌరవాన్ని వ్యక్తపరిచే ఆ క్షణం కోసం వేచి చూస్తున్నట్లు బండ్ల గణేష్ తన వ్యాఖ్యల్లో తెలిపారు. పవన్ కల్యాణ్ పట్ల బండ్ల గణేష్ కు ఉన్న అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పలు సందర్భాల్లో ఆయన పవన్ ను దేవుడిగా అభివర్ణించిన విషయం తెలిసిందే. పవన్ కల్యాణ్ ఇవాళ నాయుడుపేటలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను సందర్శించిన సందర్భంగా బండ్ల గణేష్ ఈ ట్వీట్ చేశారు.

# 'ఎస్ఐఆర్'పై వైసీపీ క్యాడర్‌ను అప్రమత్తం చేసిన సజ్జల

**'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంపై వైసీపీ ముఖ్య నేతలతో సజ్జల సమీక్ష**
**ప్రభుత్వ హామీల వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపు**
**డీఎస్సీ, నిత్యావసరాల ధరల పెరుగుదలపై పోరాటం ఉధృతం చేయాలని ఆదేశం**
**ప్రభుత్వ వైఫల్యాలపై తీర్మానాలు చేసి డిజిటల్ మీడియాలో ప్రచారం చేయాలని సూచన**
**ఓటర్ల జాబితా సర్వేపై నేతలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి నిరసన కార్యక్రమాలను ఉధృతం చేయాలని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంపై ఆయన పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిన్న జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. "చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసనలను విజయవంతం చేయాలి. ప్రజాసంఘాలు, వివిధ వర్గాల ప్రతినిధులతో పాటు కలిసివచ్చే రాజకీయ పార్టీలను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలి" అని ఆదేశించారు. డీఎస్సీ అంశంపై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యులు పడుతున్న ఇబ్బందులను కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పార్టీ కమిటీలు ప్రత్యేకంగా సమావేశమై తీర్మానాలు చేయాలని, వాటిని డిజిటల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఇంటింటి సర్వే సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సజ్జల హెచ్చరించారు. అలాగే, జూన్ 1న డీఎస్సీ అంశంపై పార్టీ యువజన విభాగం చేపట్టనున్న నిరసనలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# గాజువాకలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఆగివున్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, ముగ్గురు మృతి**
**ప్రమాదంలో డ్రైవర్ సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి**
**ఏడుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు**
**రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం వెళ్తుండగా ఘటన**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందిన విషాదకర ఘటన విశాఖ జిల్లా గాజువాకలో ఈ రోజు వేకువజామున జరిగింది. శ్రీనగర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఏపీఎస్ ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బస్సు డ్రైవర్‌తో సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం నుంచి 30 మంది ప్రయాణికులతో పార్వతీపురం వెళ్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు ఈరోజు వేకువజామున 4 గంటల సమయంలో గాజువాక శ్రీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని డ్రైవర్ గమనించకపోవడంతో ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ రాంబాబు, ప్రయాణికురాలు ఈశ్వరమ్మతో పాటు మరో గుర్తుతెలియని మహిళ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మళ్లీ సినిమాల్లో నటిస్తున్న జయం రవి... 'బెంజ్'లో కీలక పాత్ర




**లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో చేరిన జయం రవి**

**రాఘవ లారెన్స్ 'బెంజ్' చిత్రంలో కీలక పాత్ర**

**నటనకు విరామం ఇస్తున్నట్లు ప్రకటించిన కొద్ది రోజులకే ఈ పరిణామం**

**వ్యక్తిగత సమస్యల కారణంగా సినిమాలకు దూరం అన్న రవి**

**రవి నిర్ణయంతో అభిమానుల్లో ఆశ్చర్యం**

ప్రముఖ నటుడు జయం రవి అభిమానులకు శుభవార్త. కొద్ది రోజుల క్రితమే వ్యక్తిగత కారణాలతో నటనకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించిన ఆయన, ఇప్పుడు అనూహ్యంగా లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్ (రాజఖ)లో అడుగుపెట్టారు. ఇందులో భాగంగా రాఘవ లారెన్స్ హీరోగా వస్తున్న 'బెంజ్' చిత్రంలో జయం రవి ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు అధికారికంగా వెల్లడైంది. ఇవాళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. 'బెంజ్' షూటింగ్ స్పాట్‌లో రవితో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ, "రాజఖలోకి స్వాగతం" అని పేర్కొన్నారు. ఈ చిత్ర కథానాయకుడు రాఘవ లారెన్స్ కూడా జయం రవికి సాదర స్వాగతం పలికారు. కొద్ది రోజుల క్రితమే జయం రవి ఓ మీడియా సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన భార్య ఆర్తి రవితో విడాకుల ప్రక్రియ పూర్తయ్యే వరకు, తనపై జరుగుతున్న సైబర్ వేధింపులు ఆగే వరకు ఏ సినిమాలోనూ నటించనని కన్నీటితో స్పష్టం చేశారు. అదే సమయంలో గాయని కెనీషా ఫ్రాన్సిస్‌తో తన బ్రేకప్‌ను కూడా అంగీకరించారు. ఈ ప్రకటన చేసిన కొద్ది రోజులకే ఆయన 'బెంజ్' సెట్లో కనిపించడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. బక్కియరాజ్ కన్నన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నివిన్ పౌలీ విలన్‌గా నటిస్తున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' చిత్రాల మాదిరిగానే డ్రగ్ మాఫియా నేపథ్యంలో ఈ సినిమా ఉండనుంది. ఇంత త్వరగా రవి తన నిర్ణయాన్ని ఎలా మార్చుకున్నారని, ఆయన వ్యక్తిగత సమస్యలు పరిష్కారమయ్యాయా అని అభిమానులు సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు.

# 'ఫరెవర్ మై హీరో'.. నాన్నకు మహేశ్ బాబు భావోద్వేగ నివాళి

**సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్ బాబు భావోద్వేగ పోస్ట్**

**'ఫరెవర్ మై హీరో.. హ్యాపీ బర్త్ డే నాన్న' అంటూ నివాళి**

**తండ్రిపై తనకున్న ప్రేమను చాటుకున్న సూపర్ స్టార్**

**ఎమోషనల్‌గా స్పందిస్తున్న అభిమానులు, నెటిజన్లు**

సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు, స్టార్ హీరో మహేశ్ బాబు భావోద్వేగానికి గురయ్యారు. తండ్రిని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో ఓ హృదయపూర్వక పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం అభిమానుల మనసులను కదిలిస్తోంది. నేడు (మే 31) సూపర్ స్టార్ కృష్ణ జయంతి. ఈ సందర్భంగా మహేశ్ బాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్)లో 'ఫరెవర్ మై హీరో... హ్యాపీ బర్త్ డే నాన్న" అంటూ ఒక సందేశాన్ని పంచుకున్నారు. ఈ చిన్న వాక్యంలోనే తండ్రిపై తనకున్న అపారమైన ప్రేమను, గౌరవాన్ని మహేశ్ వ్యక్తం చేశారు. కృష్ణ భౌతికంగా దూరమైనా, ఆయన జ్ఞాపకాలు తనతో ఎప్పటికీ ఉంటాయని, తన దృష్టిలో ఆయనే నిజమైన హీరో అని మహేశ్ చెప్పకనే చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమలో కృష్ణ-మహేశ్‌బాబులది ప్రత్యేకమైన బంధం. తండ్రీకొడుకుల అనుబంధానికి వారిద్దరూ నిలువుటద్దంలా నిలిచారు. కృష్ణ మరణానంతరం ప్రతి సందర్భంలోనూ మహేశ్ ఆయన్ను స్మరించుకుంటూనే ఉంటారు. ప్రస్తుతం మహేశ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన అభిమానులు, నెటిజన్లు సైతం భావోద్వేగానికి గురవుతున్నారు. సూపర్ స్టార్ కృష్ణను గుర్తుచేసుకుంటూ కామెంట్లు పెడుతూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.





# నచ్చని పనికి 'నో' చెప్పడమే నా సక్సెస్: యామీ గౌతమ్

**నమ్మకం లేని పాత్రలకు 'నో' చెప్పడమే తన ఎదుగుదలకు కారణమన్న యామీ గౌతమ్**

**'ఊరి', 'బాలా' చిత్రాల తర్వాత కెరీర్ పరంగా నిర్భయంగా మారానని వెల్లడి**

**అవార్డుల కన్నా ప్రేక్షకుల అభిమానమే గొప్పదని వ్యాఖ్య**

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ తన కెరీర్ విజయ రహస్యాన్ని మరోసారి పంచుకున్నారు. తాను నమ్మని పాత్రలు, కథలకు నిర్భయంగా 'నో' చెప్పడం నేర్చుకోవడం వల్లే వృత్తిపరంగా ఎదగగలిగానని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలే మాతృత్వంలోకి అడుగుపెట్టినప్పటికీ, తన వృత్తిపరమైన నిర్ణయాల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ఇటీవల ఓ ఇంగ్లీష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యామీ ఈ విషయాలు వెల్లడించారు. "కెరీర్‌లో నిలదొక్కుకోవాలంటే కొన్నిసార్లు నమ్మకం లేని పనులకు కూడా 'నో' చెప్పడం నేర్చుకోవాలి. నా జీవితంలో ఆ మార్పు 2018లో 'ఊరి', 'బాలా' సినిమాల తర్వాత వచ్చింది. అప్పటి నుంచి నాకు నిజంగా నచ్చిన, నన్ను ప్రభావితం చేసే పాత్రలనే ఎంచుకుంటున్నాను. ఆ తర్వాతే నేను నిర్భయంగా ఉండటం మొదలుపెట్టాను," అని ఆమె వివరించారు. కేవలం ఉపాధి కోసం లేదా పరిశ్రమలో కనిపించడం కోసం సినిమాలు చేయనని గతంలోనూ యామీ స్పష్టం చేశారు. పనిలేకుండా ఉండటానికైనా సిద్ధమే కానీ, నమ్మకం లేని సినిమా మాత్రం చేయనని ఆమె గట్టిగా చెబుతారు. తనకు అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమే ముఖ్యమని యామీ పేర్కొన్నారు. "ప్రేక్షకుల ప్రశంసలకు మించిన పెద్ద అవార్డు మరొకటి లేదు. మిగతావన్నీ క్షణికమైనవి," అని ఆమె అన్నారు. ఈ ఎంపికల వల్లే ఆమె 'ఎ థర్స్ డే', 'దస్వీ', 'ఆర్టికల్ 370' వంటి విజయవంతమైన, విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.